సేంద్రియ సాగుపై ఆసక్తి

- పశువుల ఎరువులపై మొగ్గు చూపుతున్న రైతులు
- భూసారంతో పాటు పెరుగుతున్న దిగుబడి



పంట పొలంలో గొర్రెల మంద



పొలంలో సేంద్రియ ఎరువు చల్లుతున్న రైతు

ఆసిఫాబాద్‌రూరల్: రసాయన ఎరువుల వినియోగం పెరగడంతో చేలల్లో భూసారం దెబ్బతిని, తెగుళ్ల ఉధృతితో సరైన దిగుబడి రాక అన్నదాతలు అప్పుల్లో కూరుకుపోతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు ప్రత్యామ్నాయ ఆలోచనలు చేస్తున్నారు. ఈ ఏడాది ఎక్కువగా సేంద్రియ ఎరువులపైనే మొగ్గు చూపుతున్నారు. మండలంలోని రైతులు తమ పంట పొలాల్లో భూసారం పెంపొందించే నల్లమట్టి, సేంద్రియ ఎరువులను వినియోగించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

నల్లమట్టితో భూసారం

మండలంలో సుమారు 12వేల మంది రైతులు 54వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో ఎక్కువగా పత్తి పంటను 34వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈసారి రైతులు తమ పంట పొలాల్లో సేంద్రియ ఎరువులు వేసేందుకు ముందుకొస్తున్నారు. నల్లమట్టి పంట పొలాలకు ఎంతో మేలు చేస్తుందని వ్యవసాయ అధికారులు సూచించారు. ఈమేరకు పొలాల్లో నల్లమట్టి చల్లుతున్నారు. మట్టి వల్ల చేలల్లో భూసారం పెరగడంతో పాటు పంట దిగుబడులు కూడా పెరుగుతాయని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని తేలివాడ, బాబాపూర్, ఈదులవాడ, బెల్గాం, బూర్గుడ, మోతుగూడ, రాజుర, అప్పపల్లి, ఇటిక్యాల, చిర్రకుంట గ్రామాలకు చెందిన రైతులు పొలాలకు నల్లమట్టి తరలిస్తున్నారు. తమ గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటల్లోని నల్లమట్టిని తరలిస్తూ తమ పంట పొలాల్లో చల్లుతున్నారు. దీనికి దూరాన్ని బట్టి ట్రాక్టర్‌కు రూ.800 నుంచి రూ.1500 వరకు వెచ్చిస్తున్నారు.

పొలాల్లో పశువుల ఎరువు

పంట పొలాల్లో భూసారం పెంపొందడానికి నల్లమట్టితో పాటు రైతులు సేంద్రియ ఎరువులు కూడా వినియోగిస్తున్నారు. మండలం చుట్టుపక్కల గ్రామాలైన పర్సనంబాల, చిర్రకుంట, ఈదులావాడ, మోవాడ్, బెల్గాం, కోసారతో పాటు చాలా గ్రామాలకు పక్కనే ఎక్కువగా అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఆయా గ్రామాల్లో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెల పశుపోషణ ఎక్కువగా ఉంది. దీంతో చాలా మంది రైతులు పశువుల పెంటను సేంద్రియ ఎరువులుగా పంట పొలాల్లో వినియోగిస్తున్నారు. గొర్రె, మేకల మందను ఎరువుల కోసం చేలల్లో పెడుతున్నారు. ఈ ఎరువు ధర లారీకి రూ.12వేల నుంచి రూ.15వేల వరకు పలుకుతుంది. ఆవులు, గేదెల ఎరువులకు రూ. 15వేల నుంచి రూ.16 వేల వరకు డిమాండ్ ఉంది. ధర ఎంత ఉన్నా దిగుబడి కోసం రైతులు వెనుకడుగు వేయడం లేదు.

మార్కెట్‌లో సేంద్రియ ఎరువులు

నల్లమట్టి, పశువుల ఎరువులతో పాటు శాస్త్రీయ పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసిన ఇతర సేంద్రియ ఎరువులను కూడా కొంతమంది రైతులు పొలాల్లో వినియోగిస్తున్నారు. కార్బన్, గోల్డు తదితర పేర్లతో మార్కెట్‌లో సేంద్రియ ఎరువులు లభ్యమవుతున్నాయి.

సేంద్రియ ఎరువులతో దిగుబడి



సేంద్రియ ఎరువులు, నల్లమట్టి వల్ల పంట భూములు సారవంతంగా మారి పంట దిగుబడి పెరుగుతుంది. రసాయన ఎరువుల వాడకం కంటే సేంద్రియ ఎ రువులు వాడటం వల్ల నేల నాణ్యంగా ఉంటుంది.

- శంకర్, రైతు, మోతుగూడ

భూసారం పెరుగుతుంది



సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుంది. పోషకాలు పెరుగుతాయి. సూక్ష్మజీవులకు సేంద్రియ పదార్థం ఆహారంగా ఉపయోగపడుతుంది. అన్ని పంటలకు సేంద్రియ ఎరువులను విరివిగా వాడుకోవచ్చు. మంచి దిగుబడి పొందవచ్చు.

- ఖాదర్ హుస్సేన్, ఏవో

క్లుప్తంగా

'రైతుబీమా'తో కుటుంబాలకు భరోసా



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: మృతిచెందిన రైతు కుటుంబాలకు రైతుబీమా ఆర్థిక భరోసానిస్తుందని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కాగజ్‌నగర్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన చిన్నక్క ఇటీవలే మృతి చెందగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల ప్రొసీడింగ్ కాపీని శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుబీమా ఎన్నో బాధిత రైతు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదపడిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వ్యాసపూర్ణిమ



పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: వ్యాసపూర్ణిమ పవిత్ర దినోత్సవం, నారాయణ ఆశ్రమం 18వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో శుక్రవారం నందగిరి నారాయణ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గాధవేణి మల్లేష్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బెజ్జూర్ మసీద్ కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని జామియా మసీద్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం ముస్లింలు మసీద్ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా నౌషాద్ హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా అజీజ్ పాషా, కోశాధికారిగా మహబూబ్ ఖాన్‌లను ఎన్నుకోగా, 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

దండేపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు అన్నారు. మొబైల్ యాప్ తనిఖీలో భాగంగా దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా గ్రామాల్లోని పలు వీధులను, డ్రైనేజీలను పరిశీలించారు. డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని కోరారు. అనంతరం నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. పంచాయతీ రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీవో సత్యనారాయణ ఉన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : రామబాణం
కాగజ్‌నగర్
వెంకటరమణ : రామబాణం

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	60
వంకాయ	40
బీరకాయ	80
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	60
పచ్చిమిర్చి	60
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	50
గోబి(ఫూల్)	80
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

ఘనంగా భద్రతా వారోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

బెజ్జూర్: మండలంలోని క్రుష్ణపెల్లి గ్రామంలో శుక్రవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఏఈ అంజెల్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన తగు జాగ్రత్తల గురించి వివరించారు. వ్యవసాయ పంట పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడినప్పుడు సంబంధిత విద్యుత్ సిబ్బందికి వెంటనే సమాచారం అందించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకు హాని కలుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించి, ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడుతున్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కామర్స్, ఇంగ్లిష్ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను సందర్శించి బ్యాంక్ కార్యకలాపాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కామర్స్ లెక్చరర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు బ్యాంక్‌లో జరిగే లావాదేవీలను ప్రత్యక్షంగా గమనించడంతో విషయ పరిజ్ఞానం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ అశోక్ కుమార్ విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ వీరస్వామి, లెక్చరర్లు జె.ప్రేమ్ కుమార్, శరత్ చంద్ర, సుష్మిత, కవిత, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ మోతిరాం

కెరమెరి: కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం అన్నారు. శుక్రవారం మండలంలోని అగుర్‌వాడ గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దృష్టిలోపం, కంటిచూపులో ఇబ్బంది ఉన్న ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మధూకర్, పీటీజీ సూపర్‌వైజర్ సిడాం ధర్మూ తదితరులు ఉన్నారు.

రోడ్డుపై బైఠాయించి వీవోఏల నిరసన



నిరసన తెలుపుతున్న ఐకేపీ వీవోఏలు

కాగజ్‌నగర్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు కాగజ్‌నగర్‌లో చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో రోడ్డుపై మోకాళ్లపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకుడు ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ గత 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న ఐకేపీ వీవోఏలపై ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదన్నారు. రాస్తారోకో చేపట్టడంతో పట్టణంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ కల్యాణ్ సంఘటన స్థలానికి చేరుకొని వీవోఏలను అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

వినియోగదారుల సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ఆసిఫాబాద్: జిల్లాలో పని చేస్తున్న వినియోగదారుల సంస్థలు తమ సంస్థను జిల్లా కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తారామణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల హక్కులు, ఆసక్తులను పరిరక్షించడంతో పాటు వినియోగదారు సంస్థలు పోషించే ముఖ్యమైన పాత్రను తాము గుర్తించి, లక్ష్యానికి సహకరిస్తామన్నారు. తమ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయడం వల్ల వినియోగదారుల రక్షణకు సంబంధించిన చర్చలు, కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఆర్గనైజేషన్ రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 8న తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌ను 9347752492లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్‌రూరల్: అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలని జెడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శుక్రవారం మండలంలోని ఈదులవాడ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగేశ్వర్ రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాల కోసం పని చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అందరి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, సర్పంచ్ భీమేష్, నాయకులు లింగయ్య, లుంబిని దీక్ష కమిటీ అధ్యక్షుడు మనోహర్, ప్రకాష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జైపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కాన్కూర్‌లో సర్పంచ్ వెంకటేశ్వర్‌గౌడ్, వేలాలలో సర్పంచ్ శ్యామల, ఎంపీటీసీ రాజేశ్వరి, ఉపసర్పంచ్ నగేశ్‌లు ప్రారంభించారు.

ఘనంగా బుద్ధుడి జయంతి



వాంకిడి: పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: గౌతమ బుద్ధుడి జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమి వద్ద బుద్ధుడి చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని అంకుసాపూర్, చిర్రకుంటతో పాటు పలు గ్రామాల్లో జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో లుంబిని దీక్షభూమి సభ్యులు హేమంత్, రాజ్ కుమార్, ఊశన్న, తుకారం, కేశవరావు ఉన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌టౌన్: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, సమత సొసైటీ ఆధ్వర్యంలో బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని దీక్షభూమిలో వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు పంచశీల జెండా ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు విశ్వాస్ జగతాప్, విస్తారు, దుర్గం రమేశ్, రావూజీ, సునీత, కౌన్సిలర్ సునీల్, నాయకులు మోహన్, తిరుపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండలంలోని ముత్తంపేట, పార్డీ, కౌటాల, బోదంపల్లి, గుడ్లబోరి గ్రామాల్లో శుక్రవారం బుద్ధ పూర్ణిమ పురస్కరించుకొని మహర్ కులస్తులు బుద్ధుడి జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని బుద్ధ మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహర్ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు బుద్ధుడి మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ అభిమానులు, మహర్ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.



వాంకిడి: ఖమానలో పూజలు చేస్తున్న మహిళలు

వాంకిడిలో..

వాంకిడి: బౌద్ధ మార్గం అనుసరనీయమని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శుక్రవారం మండలంలోని కనర్గాంలో వైశాలి బుద్ధ విహార్ ప్రారంభోత్సవం, గౌతమ బుద్ధుడి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. బుద్ధుడు చూపిన అష్టాంగ మార్గం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రతీ ఒక్కరు ఆయన మార్గంలో నడవాలని వారు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ ముండే విమలబాయి, జెడ్పీటీసీ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవిహార్‌లలో..

బుద్ధ పౌర్ణిమ పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు ఖమాన, ఖనర్‌గాం, సరండి గ్రామాల్లోని బుద్ధ విహార్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుద్ధ, అంబేద్కర్ చిత్రపటాలకు బుద్ధ ధమ్మచారం ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. బౌద్ధ ఉపాసకులు వైరగడే పెంటు, చాప్లే చేతన్ శర్మ, జాడి మనోహర్, జాడి వసంత్, టీమాజి, కొబ్రగడే కిషన్, చాప్లే భీంరావు తదితరులు ఉన్నారు.



చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



కౌటాల: బుద్ధ మందిరంలో భక్తుల పూజలు

దోబీఘాట్ల నిర్మాణం చేపట్టాలి

తిర్యాణి: మండలంలో దోబీఘాట్ల నిర్మాణం చేపట్టాలని రజక సంఘం మండల అధ్యక్షుడు సల్లూరి జగదీశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దోబీఘాట్లు లేకపోవడంతో రజక వృత్తిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ సంఘానికి ప్రభుత్వం స్థలం కేటాయించి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

నేడు సమీక్షా సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. నెలలో మొదటి, చివరి శనివారాల్లో మండలంలో పక్షం రోజుల్లో చేపట్టిన కార్యక్రమాలు, గతంలో నిర్వహించిన సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యల గురించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు తగు నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఆయన తెలిపారు.

వేసవిలో నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ

కోటపల్లి: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏపీడీ శంకరమ్మ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని జనగామ, వెంచపల్లి, ఆలుగామ గ్రామంలోని నర్సరీల్లో మొక్కలు పెంపకం, హరితహారంలో నాటిన మొక్కలను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలను జాగ్రత్తగా పెంచాలన్నారు. వేసవికాలంలో మొక్కలకు సంరక్షించే విధంగా షెడ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్‌లు, గ్రామస్థాయి అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ మొక్కలు పెంచాలన్నారు. ఎంపీడీవో భాస్కర్, సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్, సతీశ్, సంతోశ్ పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి వ్రతాలు

మంచిర్యాలఅర్బన్: వాసవిక్లబ్, యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గోదావరి నది తీరం గౌతమేశ్వర ఆలయంలో పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం రైల్వేస్టేషన్ వద్ద అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. వాసవిక్లబ్ సీనియర్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వాసవి క్లబ్ అధ్యక్షుడు ప్రవీణ్ ఉన్నారు.

షీటీంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలకు షీటీం రక్షణ కల్పిస్తుందని షీటీం సభ్యురాలు సునీత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రధాన మంత్రి కౌశల్ కేంద్రంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు షీటీంపై అవగాహన కల్పించారు. సునీత మాట్లాడుతూ యువతులు, మహిళలు హింస, ఈవ్‌టీజింగ్‌కు గురైతే షీటీంకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ క్రైమ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలు పెరిగాయని తెలిపారు. కార్యక్రమంలో షీటీం సభ్యురాలు స్వప్న, శ్రీలత పాల్గొన్నారు.

వంతెన పనులు పరిశీలన



వంతెన పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ

కెరమెరి: మండలంలోని నాగల్‌గొంది గ్రామానికి వెళ్లే దారిలో నిర్మిస్తున్న వంతెన పనులను శుక్రవారం ఎంపీపీ పెందోర్ మోతిరాం పరిశీలించారు. వంతెన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. పనులు పూర్తయితే నాగల్‌గొంది, నాయకపుగూడ ప్రాంత ప్రజలకు ప్రయాణ కష్టాలు తీరినట్టేనన్నారు. ఆయన వెంట సిడాం ధర్మూ తదితరులు ఉన్నారు.